క్లుప్తంగా

కుక్కలున్నాయి... జాగ్రత్త



గండేపల్లి తహసీల్దార్ కార్యాలయం ద్వారం వద్ద తిష్టవేసిన కుక్కలు

గండేపల్లి: మండల ప్రజలకు విజ్ఞప్తి..మీరు గండేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్నారా..అయితే తస్మాత్ జాగ్రత్త మీరు అధికారులను కలవాలంటే ముందు కుక్కల నుంచి అనుమతి తీసుకోవాల్సిందే. తెగించి ప్రయత్నం చేసి కార్యాలయం మెట్లపైకి చేరుకునే లోపే కుక్కలు మీ పిక్కలూడదీసేందుకు సిద్ధంగా అక్కడే తిష్టవేస్తున్నాయి. ప్రధాన ద్వారం దగ్గర కుక్కలు సంచారంతో ఉండటంతో కార్యాలయానికి వస్తున్న ప్రజలు, అర్జిదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. తహసీల్దార్ కార్యాలయ సమీపంలో పోలీస్ స్టేషన్, మీ సేవా కార్యాలయం ఉండటంతో నిత్యం జనసంచారం ఉంటుంది. వివిధ ప్రభుత్వ పనులపై వస్తున్న ప్రజలు భయపడాల్సిన పరిస్థితి వస్తోందని వాపోతున్నారు.

భక్తి శ్రద్ధలతో అన్నసమారాధన



ఏలేశ్వరంలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఏలేశ్వరం: శ్రీ రామదూత హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఏలేశ్వరం పట్టణంలో శనివారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. స్థానిక షిర్డి నగర్‌లోని గాంధీజీ విగ్రహం సమీపంలోని అభయాంజనేయుని ఆలయం వద్ద వందలాది మందికి అన్నదానం చేశారు. పట్టణంలోని పలుప్రాంతాల నుంచి వందలాది భక్తులు అన్నసమారాధనలో పాల్గొని తీర్థప్రసాదములు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బొదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, గూడవిల్లి అర్జునరావు, మలిరెడ్డి సముద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యార్థులకు తర్ఫీదు

ఏలేశ్వరం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ అన్నారు. గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, విజిల్స్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు వివిధ పోటీల్లో పాల్గొని తమసత్తా నిరూపించుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే పోటీల్లో పాల్గొనడంతో అన్ని అంశాలపై సమగ్ర అవగాహన కలిగి ఉంటారన్నారు. అనంతరం కథలు చదువుట, రాయుట, పద్యాలు చదివి భావాలు చెప్పుట తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితుడికి చంటిబాబు పరామర్శ



యువకుడిని పరామర్శిస్తున్న జ్యోతుల చంటిబాబు, నాయకులు

కిర్లంపూడి: మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు కుమారుడు పృధ్వీఅభిని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శనివారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవాత్తు యువకుడి కాలికి గాయమైంది. ఈ మేరకు కాలికి ఆపరేషన్ చేయడంతో ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. కాగా చంటిబాబు బాలరాజుపేటలోని నాగబాబు స్వగృహానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట లంక మూర్తి, ఎంపీటీసీ బొద్దేటి గణపతి, శరకణం సంతోష్, యల్లపు నానాజీ ఉన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన

అన్నవరం: విశాఖపట్నానికి చెందిన బాలభవన్ నృత్య నికేతన్ విద్యార్థులు శనివారం రత్నగిరిపై వివిధ భక్తిగీతాలకు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. భక్తిగీతాలతో పాటు కూచిపూడి, భరతనాట్యంలోని పలు అంశాలను కూడా విద్యార్థులు ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు. నాట్యగురువు లలిత, నృత్యం ప్రదర్శించిన విద్యార్థినులను ఈఓ వీర్ల సుబ్బారావు అభినందించి దేవస్థానం తరుపున ప్రశంసాపత్రాలను అందచేశారు.

నిబంధనలు పాటించాలి

కోటనందూరు: రేషన్ పంపిణీలో నిబంధనలు పాటించాలని ఎంఎస్ఓ రాజు రేషన్ డీలర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలు రద్దు చేసి జూన్ 1 నుంచి రేషన్‌షాపుల ద్వారా విక్రయాలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఓ రాజు మాట్లాడుతూ ఎండీయూ వాహనాలు రద్దుతో ఇక నుంచి రేషన్ పంపిణీలో అవకతవకలకు తావు లేదన్నారు. తూకంలో వ్యత్యాసాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. పలువురు రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

జలతాండవం

- తాండవ నీటి నిల్వలు ఆశాజనకం
- తాండవ ప్రాజెక్టులో 365.10 అడుగుల నీటి మట్టం
- ముందస్తు ఖరీఫ్ సాగుకు అన్నదాత సన్నద్ధం
- జోరుగా వేసవి దుక్కులు చేస్తున్న రైతన్న
- విత్తనాలు, ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు



కోటనందూరులో వేసవిదుక్కు చేస్తున్న రైతు



సాగునీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: ఖరీఫ్ సీజన్‌లో మెట్టప్రాంత రైతాంగాన్ని ఆపద్బాంధవుడిలా ఆదుకునే తాండవ జలాశయం సాగునీటితో కళకళలాడుతోంది. గత ఏడాదితో పాటు ప్రస్తుత వేసవిలో ఆశాజనకంగా కురిసిన వర్షాతో తాండవ జలాశయంలో నీటి నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇకమీదట ఓమోస్తరు వర్షాలు కురిసినా..జలాశయం నిండుకుండలా మారే అవకాశం ఉంది. ఈ నెలాఖరుకి తొలకరి పలకరిస్తుందనే వాతావరణశాఖ ప్రకటనలతో ఖరీఫ్ సాగుకు ఢోకా ఉండదనే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అనుకూల పరిస్థితులతో తాండవ ఆయకట్టు రైతులు ముందస్తు సాగుకు సన్నద్ధమౌతున్నారు. బోర్లు, చెరువుల కింద వేసవి దుక్కులు చేసిన పాలాల్లో రైతులు మరోసారి దుక్కు చేస్తుంటుండగా మెట్ట గ్రామాల్లో జోరుగా వేసవిదుక్కులు చేస్తున్నారు. తొలకరి పలకరించిందే తడువుగా విత్తనాలు చల్లేందుకు సంసిద్ధులై ఉన్నారు. మరోప్రక్క విత్తనాలు, ఎరువుల పంపిణీకి వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విత్తనాల పంపిణీకి రంగం సిద్ధం

మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల పరిధిలోని విత్తనాలు, ఎరువుల పంపిణీకి జోరుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులకు సంబంధించి ప్రణాళికలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. తొలకరికి ముందే విత్తనాలు పంపిణీ చేస్తామని చెబుతున్నారు.

పూడికతో ముప్పు

జాలశయా పరిధిలోని కాలువల్లో భారీగా పేరుకుపోయిన పూడికతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోయే ప్రమాదం ఉంది. గత ఏడాది కేఈ చిన్నయ్యపాలెం, భీమవరపుకోట మేజర్ కాలువలతో పాటు మైనర్ కాలువల్లో సాగునీరు ప్రవాహించక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొట్టదశలో ఉన్నప్పుడు టైలాండు ప్రాంతాలకు సాగునీరు చేరక పంట పొలాలు ఎండిపోయిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు అనేక సంవత్సరాలుగా కాలువల్లో పూడిక తొలగించడకపోవడమే ఈ దుస్థితికి కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార యంత్రాంగం ముందుగానే మేల్కొని కాలువల్లో పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని టైలెండు ప్రాంత రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.

కాలువల్లో పూడిక తొలగించాలి



మండలంలోని తాండవ మేజర్, మైనర్ కాలువల్లో ఎక్కడికక్కడ భారీగా పూడిక పేరుకుపోయింది. గత ఏడాది చివరిలో సాగునీరు అందక శివారు ప్రాంతం రైతులం ఎన్నో ఇబ్బందులు పడ్డాం. సమస్యను చెప్పినా గాని అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా ముందస్తు ప్రణాళికతో అధికారులు పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.

కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

ప్రస్తుత పరిస్థితి

తాండవ జలాశయ పరిధిలో 51,465 ఎకరాల ఆయకట్టు ఉంది. అనకాపల్లి జిల్లాలో కోటవురట్ల, నర్సీపట్నం, నాతవరం మండలాల్లో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో 18,776 ఎకరాల చొప్పున విస్తరించి ఉంది. ఈ ఆయకట్టుకు 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మేజర్, మైనర్ కాలువల ద్వారా సాగునీటిని అందిస్తుంది. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్టస్థాయి నీటి నిల్వలు 340 అడుగులు. ప్రాజెక్టు నిబంధనల ప్రకారం 370 అడుగుల నీటిమట్టం ఉంటే నీటి విడుదలకు అనుకూలం. ప్రస్తుతం జలాశయంలో 365.10 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా గత ఏడాది ఇదే సమయానికి 355.4 అడుగుల నీటిమట్టం ఉంది. ఆయకట్టు రైతుల అవసరానికి అనుగుణంగా వారి అభీష్టం మేరకు నీటిని విడుదల చేస్తామని తాండవ అధికారులు చెబుతున్నారు.

అవసరానికి అనుగుణంగా నీటి విడుదల



జలాశయంలో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రస్తుతం నీటి నిల్వలు 365.10 అడుగులు ఉన్నాయి. అడపాదడపా వర్షాలు కురుస్తున్నందున క్రమంగా నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంది. రైతుల అవసరానికి అనుగుణంగా వారి అభీష్టం మేరకు నీటిని విడుదల చేస్తాం. ఆయకట్టు రైతులు ధైర్యంగా విత్తనాలు చల్లుకోవచ్చు.

పీ.అనురాధ, డీఈఈ, తాండవ జలాశయం

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించండి

ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తాం



కార్మిక నాయకులకు సమస్యలు వివరిస్తున్న ఉపాధి కూలీలు

తుని రూరల్: పూట గడవడం కోసం మండువేసవిలో పనులు చేస్తున్న మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు కూలి డబ్బులు చెల్లించాలని సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తుని మండలం హంసవరంలో ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతానికి వెళ్లిన సీఐటీయూ కార్మిక సంఘం నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్ స్వయంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరువారాల నుంచి ఉపాధి కూలిలకు వేతనాలు చెల్లించకపోవడం, తాగునీరు వంటి కనీసం మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పని నిర్వాహణకు పలుగు, పార వంటి కనీస పనిముట్లు ఇవ్వకపోవడంపై ఆయన మండిపడ్డారు. చేసిన పనులకు ఎంత కూలి గిట్టుబాటవుతుందో తెలియడంలేదని, పే స్లిప్పులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కూలీల ఆర్థిక పరిస్థితులను గుర్తించి, చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు మొత్తం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పని చేస్తేనేగాని పూటగడవని కూలీలకు కూలి డబ్బులు చెల్లించకుండ పస్తులు పెట్టడం అన్యాయమన్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వం స్పందించి బకాయిలు విడుదల చేయాలని, అవసరమైతే కూలీలతో కలసి ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.

కక్షసాధింపు సరికాదు



అంగన్వాడీ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న మండల అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులు



2020లో ప్రభుత్వం జారీ చేసిన సదరు జీవో కాపీ

అంగన్వాడీ కార్యకర్త అక్రమ తొలగింపు దారుణం

రౌతులపూడి: శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రౌతులపూడి మండలం రామకృష్ణాపురం లోగల అంగన్వాడీ కేంద్రంలో గత కొన్నేళ్లుగా కార్యకర్తగా పనిచేస్తున్న ఎం.పద్మను అక్రమంగా తొలగించి అదే గ్రామానికి చెందిన బీసీ-డి కులానికి చెందిన బంగారు భవాని అనే ఆమెను విరుద్ధంగా విధుల్లోకి చేర్చుకోవటం అన్యాయమని అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తకు ఏవిధమైన రిలీవింగ్ ఇవ్వకుండా ఏలా విధుల్లోకి చేర్చుకుంటారని వారంతా శనివారం అంగన్వాడీ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు బి.రత్నకుమారి, మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త బీసీ-డి నియామకంలో ప్రభుత్వం నాలుగు దఫాలు నియామక ప్రకటనలు ఇచ్చినప్పటికి ఎవరూ రాకపోవటంతోనే ప్రత్యమ్నాయంగా ఎస్సీ కేటగిరికి చెందిన ఎం.పద్మను కార్యకర్తగా నియమించారన్నారు. దళిత కుటుంబానికి చెందిన మహిళ కావటం ఆమెకు శాపంగా మారిందని, కక్షసాధింపు సరియైనది కాదని, వెంటనే అక్రమ తొలగింపు నిర్ణయాన్ని విరమించుకుని బాధితురాలను విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. 2020లో అప్పటివరకు పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను కొనసాగించాలని నాటి ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని, ఇప్పుడు బీసీ-డిగా పేర్కొంటున్న ఆమె 2023లో కోర్టుకు వెళితే అంతకు ముందు 2020లో ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు కాపీని సీడీపీఓ కోర్టుకు ఎందుకు సమర్పించలేదని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు సుధారాణి, పర్ల, రామలక్ష్మి, మణి, తతితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గిరిబాబును కలిసిన వివిధ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని ప్రత్తిపాడు కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని పార్టీ పొలిటికల్ అడ్వైజరీ సభ్యుడు (పీఏసి) ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబును ఏలేశ్వరం, శంఖవరం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను పార్టీ మరిచిపోదన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. ఆయనను కలిసిన వారిలో రమణయ్యపేట మాజీ సర్పంచ్ సరికోటి సిరికోటి రామారావు, సిరికోటి ప్రసాద్, అచ్చపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నూతన చర్చి ప్రతిష్ఠోత్సవం..

- ఆర్‌సీఎం నూతన చర్చి ప్రతిష్ఠోత్సవం
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న తోట నరసింహం, ముద్రగడ గిరిబాబు



ఆర్‌సీఎం చర్చ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నరసింహం, గిరిబాబు తదితరులు

కిర్లంపూడి: కిర్లంపూడి దళితపేటలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చి ప్రతిష్ఠోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రెవ.ఫా.కె.చిన్నప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశాఖ అగ్రపీఠాధిపతులు డా.ఉడుమల బాల పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిధులుగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట కో-ఆర్డినేటర్ తోట నరసింహం, ప్రత్తిపాడు కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, గణేషుల రాంబాబు, గణేషుల లచ్చబాబు పాల్గొన్నారు. అనంతరం వారికి పీఠాధిపతి సాల్వా కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విస్వాసులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. విస్వాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్‌సీఎం సంఘ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

దొంగను పట్టించిన వేలిముద్రలు

- తుని రైల్వేస్టేషన్‌లో తనిఖీలు
- పలు కేసుల్లో నిందితుడు అరెస్ట్



తుని రైల్వేస్టేషన్ తనిఖీల్లో పోలీసులకు చిక్కిన నిందితుడు ఏసుబాబు

తుని: స్థానిక రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో పలు కేసుల్లో నిందితుడుగా ఉన్న కొల్లు ఏసుబాబును అరెస్ట్ చేశామని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం రైల్వేస్టేషన్ రెండవ నంబరు ప్లాట్‌ఫాంపై ఫింగర్ డివైస్‌తో తనిఖీలు నిర్వహిస్తుండగా యానాంకు చెందిన కొల్లు ఏసుబాబు వేలిముద్రలు సరిచూడగా నేర చరిత్రతో పాటు 8 కేసులు ఉన్నట్టు తెలిసిందన్నారు. దింతో కేసు నమోదు చేసి నిందితుడిని మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచామన్నారు.

జీయ్యన్న ఆలయంలో అన్న సమారాధన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు మఠంలో వేంచేసియున్న జీయ్యన్న ఆలయంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. భక్తుల ఆర్థిక సహాయంతో అన్న సమారాధనను ఏర్పాటుచేసినట్టు జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు, తదితరులు తరలివచ్చి భక్తి శ్రద్ధలతో అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని శనివారం కూటమి నేతల వృద్ధులకు, పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మండలంలోని పెద్దిపాలెం రెడ్డి అమర్‌నాథ్ చౌదరి, ఉత్తరకంచి, ధర్మవరం, రాచపల్లి, వాకపల్లి తదితర గ్రామాల్లో కూటమి నేతల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ ఎమ్మెల్యే సత్యప్రభ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి సాగర్ సాగునీటి సంఘం అధ్యక్షుడు ఇళ్ల అప్పారావు, గ్రామ సర్పంచులు మంతిన శ్రీను, రొంగల నాగేశ్వరరావు, యర్రబత్తుల గోవిందనాయుడు, శేషారావు, ఊటా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి విద్యార్థి మృతి



రైలు ప్రమాదంలో మృతి చెందిన ఎస్‌కె.హాశిక్ (ఫైల్)

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుల్లిపాడు-నర్సీపట్నం రోడ్డు మధ్యలో రైలు నుంచి జారిపడి మన్యం జిల్లా సీలేరుకు చెందిన విద్యార్థి మృతి చెందాడని ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు దగ్గర లభించిన సెల్ ఫోన్ ఆధారంగా సీలేరులో ఉంటున్న తండ్రి ఎస్.కె.ఆలీకి సమాచారం ఇచ్చారు. ముగ్గురు కుమారులు కాగా, మృతుడు హాశిక్ పెద్ద కుమారుడని తెలిపారు. శనివారం తమకు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాలు ప్రకారం..అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరుకు చెందిన ఎస్‌కె.హాశిక్ తుని మండలం తాళ్లూరులో ఉంటున్న పెదనాన్న ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో విశాఖపట్నానికి వెళ్తుండగా ప్రమాదవ శాత్తూ రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సీలేరులోని 10వ తరగతి పూర్తి చేసి ఇంటర్ సెకండ్ ఇయర్ విశాఖపట్నంలోని ఏబీవీ కళాశాలలో చదువుతున్నాడని, చేతికి అందివచ్చిన కుమారుడు కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

అన్నవరంలో బీకేఎస్ శిక్షణా తరగతులు

ప్రత్తిపాడు: అన్నవరంలో జూన్ 2, 3 తేదీలలో భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఐదు జిల్లాల శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు బీకేఎస్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు తెలిపారు. ఈశిక్షణా తరగతుల్లో జిల్లా కమిటీ సభ్యులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రత్తిపాడులో శనివారం సాయంత్రం బీకేఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా మాట్లాడుతూ జిల్లా ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నందున అధ్వానంగా ఉన్న పంట కాలువలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. పంట కాలువల్లోని తుప్పలు, గుర్రపు డెక్క తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో బీకేఎస్ ప్రతినిధులు నీలగిరి చిట్టిబాబు, ఆకుల హరిబాబు, దాడిశెట్టి పావని, కాకిలేటి వీర్రాజు, జువ్విన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రంగంలోకి అధికారులు

- రసాయన వ్యర్థ జల నమూనాల సేకరణ
- సీసీటీవీ ఫుటేజీల పరిశీలన

తొండంగి: మండలంలోని రావికంపాడు శివారులో పరిశ్రమలకు సంబంధించిన రసాయన వ్యర్థాలు వేసిన సంఘటనపై పత్రికల్లో కథనాలు ప్రచురితంకావడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించారు. రావికంపాడు శివారులో రైల్వేస్టేషన్ సమీపంలో పుంత రోడ్డులో పరిశ్రమలకు సంబంధించిన ప్రమాదకర రసాయన వ్యర్థాలను వాహనలపై తెచ్చి పారవేస్తుండటంతో స్థానిక రైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. దీనిపై పత్రికల్లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ నేపధ్యంలో శనివారం కాకినాడకు చెందిన కాలుష్య నియంత్రణ మండలి ఎనలిస్ట్ ప్రతాప్, ఫీల్డ్‌మేన్ రమేష్, ఇతర సిబ్బంది రసాయన వ్యర్థాల నమూనాలను సేకరించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఏయే వాహనాలపై రసాయన వ్యర్థాలు వస్తున్నాయి అన్న అంశాలపై అధికారులు వివరాలను సేకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నారు. స్థానిక పంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. శానిటేషన్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలి



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో డ్రైనేజీ అధ్వానంపై నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రత్తిపాడు: రోడ్డు గుంతలు పడటంతో చిన్నపాటి వర్షానికే ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు జంక్షన్ చెరువులా మారుతుందని వెంటనే డ్రైను నిర్మించాలంటూ కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం ఆందోళన చేపట్టారు. నిత్యం రద్దీగా ఉండే అల్లూరి జంక్షన్ వర్షానికి చెరువులా మారుతుందని వాపోయారు. ఈ జంక్షన్ వద్ద ఉన్న డ్రైన్లు పూడికపోవడం, రోడ్డుపై ఉన్న వర్షపు నీరు పోయే మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వాహన చోదకులకు ప్రయాణం ప్రయాసగా మారడం, తరచు గోతుల్లో పడి గాయపడటం, వాహనాలు మొరాయించడం వంటి సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయన్నారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ అల్లూరి జంక్షన్‌లో డ్రైను ఏర్పాటు చేయాలని అనేక మార్లు అధికారులకు విన్నవించినా చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. తక్షణం అల్లూరి జంక్షన్‌లో నీటి నిల్వలు లేకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అధికారుల గైర్హాజరు

- ప్రత్తిపాడు మండల సర్వసభ్య సమావేశానికి అధికారుల గైర్హాజరు
- సమావేశంలో ప్రొటోకాల్‌పై రగడ



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండల కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్యం, పట్టు, మత్స్య తదితర శాఖల అధికారులు మండల సమావేశాలకు తరచు దుమ్మా కొట్టడం పట్ల సభ్యులు విరుచుకుపడ్డారు. సమస్యలు విన్నవించుకుందామంటే అధికారులు లేకపోవడంతో అవి సమస్యలుగానే మిగిలిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ మాట్లాడుతూ వరసగా సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు కోరుతూ జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు.

నిధులు విడుదల

ప్రత్తిపాడులోని పెడ కాల్వ, పెరుమాళ్లరాజు కాల్వ పనులు సక్రమంగా జరగడం లేదని ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు ఆరోపించారు. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు గేట్లు తదితర మరమ్మత్తులకు రూ.10 లక్షలు, నీటి పారుదలకు సంబంధించిన 14 పనులకు రూ.55 లక్షలు మంజూరైనట్లు ఆశాఖ ఏఈ ఎస్‌కే ఇబ్రహీం తెలిపారు. పశువులకు గొంతువాపు వ్యాధికి టీకాలు వేస్తున్నామని, సబ్సిడీపై జొన్న విత్తనాలు సరఫరా చేస్తున్నామని ధర్మవరం ప్రభుత్వ పశువైద్య శాల అధికారిణి ఎస్ వరలక్ష్మి తెలిపారు. మండలంలో నిరుపయోగమైన భూములను సాగులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గ్రామాల్లో అటువంటి భూములను గుర్తించి, రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించాలని ఉద్యానశాఖాధికారిణి వై.శ్రీవల్లీ కోరారు.

సూర్యఘర్ పథకానికి 715 దరఖాస్తులు

గ్రామాల్లో విద్యుత్ శాఖ సిబ్బంది పనితీరు అధ్వానంగా ఉందని చినశంకర్లపూడి, ఉత్తరకంచి, ప్రత్తిపాడు ఎంపీటీసీలు పిల్లా కొండలరావు (చిన్నా), ఉమ్మిడి తాతీలు, సీంద్రపు భాస్కరరావులు ఆరోపించారు. గతంలో మాదిరిగా శంఖవరం 2 ఫేస్ నుంచి కొంతంగి వరకు ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను ఉద్దండ జగన్నాధపురం వరకు పొడిగిస్తే చింతలూరు, వెంకటనగరం, పోతులూరు, వాకపల్లి, తోటపల్లి గ్రామాలకు విద్యుత్ కొరత ఉండదని ఆగ్రామ సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు కోరారు. రౌతుపాలెంలో రెండు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఇప్పటి వరకు అతీగతీ లేదని సర్పంచ్ కొంగన కుమార్ తెలిపారు. కాలనీ ఇళ్లకు ప్రభుత్వం ఇచ్చేది రూ.2.5 లక్షలే కదా...మరి చినశంకర్లపూడిలో రూ.5 లక్షలు ఇస్తుందంటూ టీడీపీ నాయకులు చెప్పడమేమిటోనని ఆ గ్రామ ఎంపీటీసీ పిల్లా చిన్నా సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో 5,000 పీఎం సూర్యఘర్ పథకం లక్ష్యంగా కాగా ఇంతవరకు 715 దరఖాస్తులు అందాయని ఏపీఎం వై.వెంకట్ తెలిపారు.

ప్రొటోకాల్‌పై ఉల్లంఘనపై రగడ

అధికారులు ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల సమాచారం ఎంపీటీసీలకు గానీ, సర్పంచ్‌లకు గానీ అధికారులు చేరవేయకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ఇకపై గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల సమాచారం ప్రజాప్రతినిధులకు చేరవేయాలని, ఏమైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని ఎంపీపీ కాంతి సుధాకర్ అధికారులను కోరారు. మండల స్థాయి అధికారులంతా ప్రొటోకాల్ విధిగా పాటించాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ కేవీపీఎస్ కాశీ విశ్వనాధం, విద్యుత్‌శాఖ ఎం.డీఈ రాజశేఖర్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.